క్లుప్తంగా

హైస్కూల్‌లో జూనియర్ కళాశాల ప్రారంభం



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం

అంబాజీపేట: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు హెచ్‌ఎం బీర హనుమంతరావు, పీఎంసీ చైర్మన్ అరిగెల రామతులసి తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఉన్నతాధికారుల నుంచి ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియెట్ తరగతులు నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయన్నారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని వాటిలో ఏదో ఒకటి విద్యార్థులు ఎంపిక చేసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం ఎంపీసీకి 40 మంది, సీఈసీకి 40 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చేరేలా విద్యార్థులను చైతన్య పరుస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనుభవజ్ఞులైన ఏడుగురు లెక్చరర్లను ప్రభుత్వమే నియమించిందన్నారు. గ్రామాల్లోని ఇంటర్ చేరే విద్యార్థులకు ప్రభుత్వ ఉచిత జూనియర్ కళాశాలలపై అవగాహన కల్పిస్తున్నారు.

రామస్వామి చిరస్మరణీయుడు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానం వ్యవస్థాపకుడు మొల్లేటి రామస్వామి చిరస్మరణీయుడని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శ్లాఘించారు. రామస్వామి జయంతి సందర్భంగా గురువారం ఆలయ ప్రాంగణంలోని రామస్వామి, ఆదిలక్ష్మి దంపతుల విగ్రహాలకు ఎమ్మెల్యే చిట్టిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవస్థానం ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, చీరలు, పండ్లు పంచారు. రామస్వామి కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు అందించి వారిని సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాల బాలాజీ స్వామి ఆలయ నిర్మాణం ద్వారా అప్పనపల్లి గ్రామానికి రామస్వామి జాతీయ స్థాయిలో గుర్తింపును తీసుకువచ్చారన్నారు. గ్రామ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపచేశారని కీర్తించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఆలయ ఈఓ డి.శ్రీ రామవరప్రసాదరావు ఆధ్వర్యం వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ, పీఏసీఎస్ చైర్మన్ గెద్దం కృష్ణమూర్తి, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీను, బత్తుల విజయ గంగారత్నం, బొరుసు పార్వతీదుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి సాయం

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెం శివారు ఓసూరివారి చెరువుగట్టు ప్రాంతానికి చెందిన కె.ధర్మారావుకు, కువైట్ కేంద్రంగా ఉన్న క్రీస్తు కృపా సంఘం రూ.5 వేల ఆర్థిక సాయం గురువారం చేసింది. చర్మవ్యాధితో మంచానికే అతను పరిమితమయ్యాడు. ఈమేరకు సంఘ పాస్టర్ గొల్లమండల శ్యామ్ పంపిన పై మొత్తాన్ని బాధితుడికి వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లి డేవిడ్, ఎంపీపీ వీరా మల్లిబాబు అందజేశారు. సరెళ్ల విజయ్ ప్రసాద్, చింటు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను మహిళా పోలీసులు పరిశీలించాలి

ఆత్రేయపురం: మండలంలోని ఉన్న మహిళా పోలీసులంతా వారి పరిధిలోని ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి వారం సందర్శించి గర్భిణులు, బాలింతలు ఇంటికి వెళ్లి అంగన్‌వాడీల ద్వారా అందుతున్న సేవల గురించి తెలుసుకోవాలని ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఉన్న మహిళ పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా పోలీసులు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి సీఆర్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. చైల్డ్ ఆధార్ ఎన్‌రోల్ చేసేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. స్టాక్, హాజరు రిజిస్టర్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేశారో లేదో రికార్డు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అంశాల్లో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపర్చాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని మహిళా పోలీసులు ఉన్నారు.

పవర్ లిఫ్టింగ్ విజేతకు సత్కారం



సిల్వర్ మెడల్ సాధించిన గోడి సుభద్ర

మలికిపురం: స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థిని గోడి సుభద్ర 10వ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచినందుకు గాను గురువారం సదరు కళాశాలలో యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ నెల 20, 21 తేదీల్లో గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన పై పోటీల్లో 52 కేజీల విభాగంలో ఆమె రెండో స్థానం కైవసం చేసుకుంది. ఈ మేరకు సిల్వర్ మెడల్ సాధించిన సుభద్రను కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ టీవీవీ సత్యనారాయణ రావు సత్కరించారు. బయోకెమిస్ట్రీ అధ్యాపకుడు శివాజీ, స్టాఫ్ ఆనంద్ మహనీ, రవి, కోచ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలు విలవిల

- ఎండదెబ్బకు అల్లాడుతున్న పశువులు
- దోమలతో నరకం
- తగ్గుతున్న పాల దిగుబడి



అంబాజీపేటలో చెట్ల నీడలో సేదదీరుతున్న పశువులు

అంబాజీపేట: అధిక ఉష్ణోగ్రతలు.. వడగాడ్పులతో మూగజీవాలు నానాఅవస్థలు పడుతున్నాయి. ఆరుబయట ఎండలోను, చెట్ల కింద నీడలోను తలదాచుకుంటున్నాయి. అధిక వేడికి పశువులు, గొర్రెలు వగర్పునకు గురై మేత కూడా మేయడం లేదని రైతులు చెబుతున్నారు. ఎండ నుంచి పశువులకు రక్షణ కల్పించేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కొంత మంది రైతులు తమ కొబ్బరితోటల్లో, మామిడితోటల్లో, పశువుల పాకల్లో పశువులను ఉంచుతున్నారు. మరికొందరు ఎండ తగలకుండా తాత్కాలిక షెడ్లటు చేస్తున్నారు. కొంత మంది రైతులు పశువులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి వాటికి వేడి తగలకుండా ఫ్యాన్లు, మంచి నీటి సదుపాయం ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం పశువులకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్యులు చెప్తున్నారు. వడదెబ్బ తగిలిన పశువు పాల ఉత్పత్తి తగ్గడమే కాక.. ఎదకు వచ్చే పరిస్థితులు కనిపించవని, చూడుకట్టే అవకాశం ఉండదని హెచ్చరిస్తున్నారు. గేదెలు, ఆవులపై సరైన శ్రద్ధ తీసుకోకుంటే వడదెబ్బకు గురై.. ఒక్కోనిపోయే ప్రమాదం ఉందంటున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో ఆవులు 9,500, గేదెలు 12,300, గొర్రెలు, మేకలు 14,000, కొత్తపేట నియోజకవర్గంలో ఆవులు 6180,, గేదెలు 8,500, గొర్రెలు, మేకలు 8,100, రాజోలు నియోజకవర్గంలో ఆవులు 5,150, గేదెలు 8,070, గొర్రెలు, మేకలు 4,200 ఉన్నాయి. రోజులో కనీసం నాలుగు సార్లు నీటిని అందించడం అవసరం. నీడ ప్రాంతంలో నిల్వ ఉంచిన చల్లటి నీటినే పశువులకు తాగించాలి. ఆవులతో పోలిస్తే గేదెలు ఎక్కువగా నీటిని తాగుతాయి. ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువుల వయస్సు ఆధారంగా రోజుకు సుమారు 35 లీటర్ల నీరు అవసరమవుతాయి. పాలిచ్చే పశువులు అదనంగా ప్రతి లీటరు పాల దిగుబడికి 4 నుంచి 5 లీటర్ల చొప్పున నీటిని తాగుతాయి. పశువుల పాక చుట్టూ పాత గోనెలు, పంచెలు, చీరలు కట్టి వాటిని అప్పుడప్పుడు తడుపుతూ ఉండాలి. పాక రేకులతో వేసినట్లయితే పై కప్పును కొబ్బరి, తాటి ఆకు, వరిగడ్డితో కప్పాలి. మంచినీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేట్లు చూడాలి. పశువులను ఉదయం, సాయంత్రం మాత్రమే అంటే చల్లని వాతావరణంలోనే మేతకు వదలాలి. వీలైనంత పచ్చని మేతను ఇవ్వాలి.

ఎండ తగలకుండా చూడాలి



ఎక్కువ సేపు పశువులను ఎండ తగలకుండా జాగ్రత్తలు వహించాలి. ఉదయం, సాయంత్రం సమయంలో మేతకు తీసుకువెళ్లాలి. వీలైనంత మేరకు పశువులకు నీరు పెట్టాలి. ఎక్కువగా పశువులను చల్లని ప్రాంతాల్లో ఉంచేలా చూడాలి.
– డి.రాజేంద్రప్రసాద్, పశువైద్యాధికారి, పుల్లేటికుర్రు

పాల దిగుబడి తగ్గింది



ఎండ, వడగాడ్పుల కారణంగా పశువుల్లో పాల దిగుబడి గణనీయంగా తగ్గింది. వేడి గాలులు వీచే సమయంలో పశువులను చల్లని తోటల్లో కడుతున్నాం. ఎండ తగలకుండా పాక వేశాం. పశువుల రక్షణకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.
– మట్టా వెంకటేశ్వరరావు, రైతు, మాచవరం

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



సఖినేటిపల్లి మొక్కతోట ఏరియాలో బాధితుడికి సాయం చేస్తున్న జెడ్పీటీసీ అన్నపూర్ణ

సఖినేటిపల్లి: స్థానిక మొక్కతోట ప్రాంతంలో లివర్ సమస్యతో బాధపడుతున్న దొండపాటి చిట్టికి వైద్య ఖర్చులకై గురువారం రామేశ్వరంకు చెందిన జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. చిట్టి అనారోగ్య విషయాన్ని స్నేహితుల ద్వారా తెలుసుకున్న సదరు గ్రామానికి చెందిన ఖతార్ వైఎస్సార్ సీపీ కన్వీనర్ దొండపాటి శశికిరణ్ పై మొత్తాన్ని పంపారు. దీనిని శశికిరణ్ తల్లి, జెడ్పీటీసీ అన్నపూర్ణ బాధితుడికి అందజేశారు. భూపతిరెడ్డి, జె.వెంకటపతి రాజు, నేతల గాంధీ, కట్టా రాముడు, రాపాక శేఖర్ పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



ఆలమూరులో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



జి.అగ్రహారంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: అవినీతికి తావులేకుండా అర్హులైన లబ్ధిదారులందరికీ నేరుగా ఇంటికి వెళ్లి పంపిణీ చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నేలపూడి లావణ్య అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన గ్రామ వలంటీర్లకు వందనం సభకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజలకు తమ వంతు సేవ చేయాలనే సదుద్దేశంతో ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పేదలకు విశేష సేవలు అందిస్తున్న గ్రామ వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అనంతరం సేవావజ్ర సేవారత్న, సేవా మిత్ర అవార్డులు పొందిన గ్రామ వలంటీర్లకు దుశ్శాలువ కప్పి పూలమాలలు వేసి అభినందన పత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. రాబోయే కాలంలో మరింత అంకితభావంతో పనిచేసి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావలసిన బాధ్యత గ్రామ వలంటీర్లదేనన్నారు. మండలంలోని మిగిలిన గ్రామాల్లో పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు నేతృత్వంలో స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించి అవార్డులు అందజేస్తారన్నారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపీటీసీ ఉండమట్ల విజయకుమారి, ఎంఏఎస్ అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు, ఆలయ కమిటీ చైర్మన్ వనుం సూరిబాబు, నాతి కుమార్ రాజా పాల్గొన్నారు.



మేడిచర్లపాలెంలో అవార్డులు అందుకున్న వలంటీర్లుతో ఎమ్మెల్యే రాపాక

అవార్డు విజేతలు వీరే..

ఆలమూరు మండలంలో ఇద్దరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న, 460 మందికి సేవా మిత్ర అవార్డులకు ఎంపికయ్యారు. సేవా వజ్ర అవార్డు పొందిన వారిలో బుడ్డిగ అన్నపూర్ణ (చెముడులంక-1), పసుపులేటి సురేష్ (చెముడులంక-2) ఉన్నారు. సేవా వజ్రకు రూ.30 వేలు, సేవారత్నకు రూ.20 వేలు, సేవా మిత్రకు రూ.పది వేలు చొప్పున మండలంలో 460 మంది గ్రామ వలంటీర్లకు రూ.46.90 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పేర్కొన్నారు.

సంక్షేమ ఆశయ సారథులు వలంటీర్లు

అంబాజీపేట: సంక్షేమ పథకాలను పేదల వద్దకు చేర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్న వలంటీర్లు సంక్షేమ సారథులని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల్లో సర్పంచ్‌లు కాండ్రేగుల శ్రీనివాసరావు, దొంగ నాగేశ్వరరావుల అధ్యక్షతన వలంటీర్లకు సేవా రత్న అవార్డులను గురువారం అందజేశారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ వలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేస్తున్నందు వల్లే ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందన్నారు. విప్లవాత్మకమైన వలంటీర్ల వ్యవస్థపై దేశంలో అధ్యయనం జరుగుతోందన్నారు. ప్రజలకు కుటుంబ సభ్యులకు సేవాతత్పరులుగా వలంటీర్లు నిలిచారన్నారు. అనంతరం వలంటీర్లకు సేవా రత్న, మిత్ర, వజ్ర పురస్కారాలను, మెడళ్లను అందించి ఘనంగా సత్కరించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు మట్టపర్తి చంద్రశేఖర్, దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీ నెల్లి పండు, వాసంశెట్టి చినబాబు, విత్తనాల శేఖర్, రాయుడు షన్ముఖ్, ఎంఎం శెట్టి, రాయుడు కృష్ణమహేష్ పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

రావులపాలెం: మండలంలోని దేవరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని సర్పంచ్ దొమ్మేటి అర్జున రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు హాజరై ఉత్తమ ప్రతిభ కనబర్చిన 55 మంది వలంటీర్లకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గన్నవరపు వెంకట్రావు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా వలంటీర్లు

మలికిపురం: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం మండలంలోని రామరాజులంక, మేడిచర్ల పాలెం, గుడిమెళ్ళంక గ్రామాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు. అవార్డులు పొందిన వలంటీర్లను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఎంపీడీవో యు.బాబ్జీరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల బ్రహ్మాజీ, రావి గోపాలకృష్ణ, నల్లి శివకుమార్, చింతా రాజబాబు, నల్లి బాలకృష్ణ, దేవ దయానంద్, గంటా రవికుమార్, వి.రామచంద్రరరావు, రాపాక సూర్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం ఆకాంక్ష

- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- ఆలమూరులో గడప గడపకూ..



ఆలమూరులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: ప్రజా సంక్షేమమే పరమావధిగా పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సీఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నాయని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి వివరించారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ నేలపూడి లావణ్య, ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీల మేరకు ప్రవేశపెట్టిన నవరత్నాలతో లబ్ధిదారులకు కలిగిన లబ్ధిని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఇంటింటికీ వెళ్లి గణాంకాలతో సహా వివరించారు. స్థానికులు లేవనెత్తిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తూ, సందేహాలను నివృత్తి చేశారు. రాబోయే ఎన్నికల్లో మన ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటికి వచ్చి పింఛన్‌ను పంపుతున్న సీఎం జగన్‌ను వృద్ధులు ఆశీర్వదించారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, పీఏసీఎస్ చైర్మన్లు నెక్కంటి వెంకట్రాయుడు, మోటుపల్లి వెంకన్న, ఆలయ కమిటీ చైర్మన్ వనుం సూరిబాబు, ఎంపీటీసీ ఉండమట్ల విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

పేదల కుటుంబాల్లో వెలుగులు: ఎమ్మెల్యే చిట్టిబాబు



గంగలకుర్రులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: సీఎం జగన్ పరిపాలన పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు, గంగలకుర్రులో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, పార్టీ నాయకులతో కలసి ఎమ్మెల్యే చిట్టిబాబు ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, రైతు భరోసా, జగనన్న విద్యా దీవెన, సున్నావడ్డీ తదితర పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి 3 ఏళ్లలో ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ పార్టీలు, కులమతాలు వర్గాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్ వలంటీర్, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నేరుగా లబ్ధిదారులకే పథకాలు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీను, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీ నెల్లి పండు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, దొమ్మేటి నాగన్న, ముత్తాబత్తుల ప్రశాంత్, పితాని కాశీ, బొక్కా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ విజేత రమణికి ఘన స్వాగతం

స్వగ్రామం ఈదరాడలో సన్మానం



లక్ష్మీరమణికి శ్రీకృష్ణదేవరాయలు చిత్రం బహూకరిస్తున్న టీబీకే నేతలు

మామిడికుదురు: సివిల్స్‌లో అద్భుతమైన ప్రతిభ చూపిన యర్రంశెట్టి ఉమాశ్రీలక్ష్మీరమణికి గురువారం స్వగ్రామం ఈదరాడలో ఘన స్వాగతం లభించింది. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా బాల్కిలో ఉంటున్న రమణి స్వగ్రామం విచ్చేసింది. ఈ సందర్భంగా స్థానికులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. మేళతాళాలు, విద్యార్థుల స్వాగతం నడుమ గ్రామ దేవత పోశమ్మ ఆలయానికి తీసుకువెళ్లారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం రమణిని పలువురు ఘనంగా సత్కరించారు. సివిల్ సర్వీసు పరీక్షల్లో ఆమె ఆల్ ఇండియా స్థాయిలో 583వ ర్యాంకు సాధించింది. శ్రీలక్ష్మీరమణి మాట్లాడుతూ రిటైర్డ్ ఉపాధ్యాయుడు తాతయ్య రామారావు, తండ్రి యర్రంశెట్టి కాశీవిశ్వేశ్వరరావు, తల్లి భవాని, సోదరుడు నవీన్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఐఏఎస్ కావాలన్న తన కల సాకారమైందన్నారు. ఎంతో కష్టపడి చదువుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించానని చెప్పారు. స్వగ్రామంలో ప్రముఖులతో సన్మానం అందుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొంది. సివిల్స్‌లో మంచి ప్రతిభ చూపిన శ్రీలక్ష్మీరమణి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అభిలషించారు. రమణికి పుష్పగుచ్ఛం అందించి, ఆమెను శాలువాతో సత్కరించారు. ఆయన వెంట పార్టీ నేతలు యెరుబండి సూరిబాబు, సూరిశెట్టి బాబి, వడ్డి ఆదిబాబు, చేట్ల సత్యనారాయణ ఉన్నారు.

ప్రముఖుల సన్మానం...


సివిల్స్ విజేత రమణిని టీబీకే అమలాపురం డివిజన్ కన్వీనర్ కల్వకొలను తాతాజీ, మండల కన్వీనర్లు జక్కంపూడి వాసు, అడబాల తాతకాపు తదితరులు సన్మానించారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, స్థానిక సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, మొల్లేటి శ్రీనివాస్, బోణం బాబు తదితరులు రమణిని సన్మానించారు. పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు రమణిని సన్మానంలో ముంచెత్తారు.

వివాహిత అదృశ్యంపై కేసు

పి.గన్నవరం: గ్రామంలో ఒక వివాహిత ఇంటి నుంచి అదృశ్యమైన సంఘటనపై పి.గన్నవరం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై హరికోటిశాస్త్రి తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక భవానీ కాలనీకి చెందిన యమునకు 2020లో కొవ్వూరుకు చెందిన శివరామకృష్ణతో వివాహం జరిగింది. ఇటీవల భార్యాభర్తల మధ్య వివాదాలు జరగడంతో 20 రోజుల క్రితం యమున కొవ్వూరు నుంచి పి.గన్నవరంలోని పుట్టింటికి వచ్చి, తల్లి వద్ద ఉంటోంది.

ఈ క్రమంలో పెద్దలు ఇటీవల భార్యాభర్తలకు నచ్చజెప్పి ఈనెల 24న భార్యను అత్తారింటికి పంపేందుకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో 23వ తేదీ సాయంత్రం యమున కొత్త దుస్తులు కొనుగోలు చేస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాలు గాలించినప్పటికీ ఆమె ఆచూకీ తెలియక పోవడంతో తల్లి దుర్గ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వాడపాలెంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



వాడపాలెంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

కొత్తపేట: మండలంలోని వాడపాలెం సెంటర్‌లో ఎన్టీ రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో నెలకొల్పిన విగ్రహాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి పెద్దపీట

రాజోలు: క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. గురువారం రాజోలులోని పీనియల్ చర్చి ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పాస్టర్స్ సంక్షేమ సంఘం(కేపీడబ్ల్యూఏ) రెండో వార్షికోత్సవ సభ జరిగింది. అధ్యక్షుడు బిషప్ శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన జాన్‌వెస్లీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంఘం ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాని నిర్ణయించారు. డాక్టర్ మేరీ అనిత అనువదించిన 'జీవిత సమస్యలకు పరిష్కారం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. చైర్మన్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ సీఎం జగన్ క్రైస్తవులకు అండగా నిలుస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పాస్టర్లకు గౌరవ వేతనం అందిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో రెండోపర్యాయం సీఎంగా జగన్‌ని విజయపథం వైపు నిలపాలన్నారు. శాంతి సదన్ మినిస్ట్రీస్ అధినేత ఈద సిరిల్ జాషువా సమకూర్చిన రూ.2 వేలు విలువ చేసే బైబిల్‌ను రెండు వందల మంది పాస్టర్లకు జాన్‌వెస్లీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సంధ్య, కోనసీమ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కనపాల బాబురావు, ఉపాధ్యక్షుడు జి.యేసురత్నం, గోడి ఫాలు, ప్రసాద్, కుంచే పేతూరు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

పి.గన్నవరం: గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పి.గన్నవరంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలకు రూ.16 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీలను ఎమ్మెల్యే చిట్టిబాబు గురువారం ప్రారంభించారు. సర్పంచ్ బొండాడ నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ సీఎం జగన్ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని అన్నారు. నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, అడ్డగళ్ల వెంకటసాయిరామ్, యన్నాబత్తుల ఆనంద్, కర్రి బాబూరావు, పి.వెంకటలక్ష్మి, నాగాబత్తుల యువరాజు, దొమ్మేటి దుర్గారావు, దాసరి కాశీ, పంచాయతీ కార్యదర్శి జి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయి నుంచీ బలోపేతం చేయాలి

కొత్తపేట: గ్రామ స్థాయి నుంచీ బీజేపీని బలోపేతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని ఆ పార్టీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం కొత్తపేటలో మండల శాఖ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి అధ్యక్షతన తన స్వగృహంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ నాయకుడు నల్లా పవన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాల్లో బూత్ కమిటీల నియామకం, శక్తి కేంద్రాలు ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేయాలన్నా రు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

పి.గన్నవరం: వేసవి తీవ్రత నేపథ్యంలో కోనసీమలోని పలు గ్రామాల్లో రావులపాలేనికి చెందిన సాకా చిన్నిబాబు మెమోరియల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీ మాజీ ప్రతిపక్ష నేత సాకా ప్రసన్నకుమార్ మొబైల్ చలివేంద్రం ద్వారా ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం పి.గన్నవరం మూడు రోడ్ల సెంటర్లో వెయ్యి మజ్జిగ ప్యాకెట్లను ఆర్టీసీ బస్సులు, మోటారు వాహనాల్లో వెళ్తున్న ప్రయాణికులకు, స్థానికులకు పంపిణీ చేశారు. ప్రసన్నకుమార్‌ను పలువురు అభినందించారు. వేసవిలో ఆయన అందిస్తున్న సేవలను అభినందించారు. పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకటసాయిరామ్, నాగాబత్తుల యువరాజు, దాసరి కాశీ, కొక్కిరి రవికుమార్, దూనబోయిన రవిచంద్ర, పుచ్చకాయల నర్సింహమూర్తి, అడ్డగళ్ల శ్రీను, నూకపెయ్యి రాజేంద్రకుమార్, పెచ్చెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వక్కలంకలో..

అంబాజీపేట: అధిక ఉష్ణోగ్రతలకు గురికాకుండా మజ్జిగతో ఉపశమనం లభిస్తుందని సర్పంచ్ వాసంశెట్టి రేవతి, ఎంపీటీసీ పిల్లి సత్యవతి, పార్టీ నాయకుడు వాసంశెట్టి పెదబాబులు అన్నారు. వక్కలంకలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు సర్పంచ్ రేవతి ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనులు జరిగే ప్రాంతంలో టెంట్లు, మంచినీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. పిల్లి రమేష్, కొప్పిశెట్టి శ్రీను, మట్టపర్తి లక్ష్మి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పవర్ టిల్లర్ల పంపిణీ

ఆలమూరు: రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వ ప్రవేశపెడుతున్న వ్యవసాయ పరికరాలు, యంత్రాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు బొబ్బా చినవీరన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) కార్యాలయంలో ఏవో ఎస్.లక్ష్మీలావణ్య ఆధ్వర్యంలో రాయితీపై పవర్ టిల్లర్ల పంపిణీ గురువారం జరిగింది. ఏడుగురు రైతులకు రూ.14.55 లక్షల విలువైన పవర్ టిల్లర్లను 40 శాతం రాయితీపై రాయితీపై అందజేశారు. ఒక్కో పవర్ టిల్లర్ ఖరీదు రూ.2.08 లక్షలు కాగా రైతుకు రూ.52 వేలు రాయితీ మినహాయించి మిగతా సొమ్మును బ్యాంకు రుణంగా ప్రభుత్వం సమకూర్చింది. ఆర్బీకేల ద్వారా ధాన్యాన్ని విక్రయించిన రైతాంగానికి గడపులోపే గిట్టుబాటు ధరను బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నామని ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి పేర్కొన్నారు.

హామీల అమలుకై గ్రామస్తుల ధర్నా

మలికిపురం: మండలంలోని శంకరగుప్తం పంచాయతీ సెంటర్‌లో గురువారం గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. శంకరగుప్తంతో బాటు సరిహద్దు గ్రామాలైన అడవిపాలెం, బట్టేలంకలలో ఓఎన్జీసీ సంస్థ గతంలో ఇచ్చిన లిఖితపూర్వక హామీలు అమలు జరగకపోవడంతో పై ఆందోళన వారు చేపట్టారు. హామీలు తక్షణం నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. వీరికి ప్రజాప్రతినిధులు, నాయకులు మద్దతు పలికారు. సర్పంచ్ రాపాక ఆనంద్ కుమార్ ఆధ్వర్యాన ఎంపీటీసీలు గ్రామస్తులు పాల్గొన్నారు.

హిజ్రా హత్య కేసులో పురోగతి!

ఆలమూరు: 216 ఏ జాతీయ రహదారిలోని జొన్నాడ వద్ద ఈనెల 12న అర్ధరాత్రి సమయంలో దారుణహత్యకు గురైన హిజ్రా మరిపట్ల ఆనంద్ అలియాస్ ఆనంది (33) హత్య కేసులో ఆలమూరు పోలీసులు పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. స్థానిక బస్టాండు సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా స్థానికుల ఇచ్చిన సమాచారంతో ఎస్సై ఎస్.శివప్రసాద్ నేతృత్వంలో దర్యాప్తును వేగవంతం చేశారు. అత్యంత విశ్వసనీయ సమాచారాన్ని బట్టి ఈ కేసులో ఇప్పటికే పలువురు నిందితులను గుర్తించినట్లు తెలుస్తోంది. మరో రెండు రోజుల్లో ఈ కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నట్లు భోగట్టా.